క్లుప్తంగా

భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ ఏర్పాటు



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేసే భక్తుల వాహనాల సౌకర్యార్థం పార్కింగ్ ఏర్పాటు చేశామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. దేవస్థానానికి చెందిన కోనేరు వద్ద పార్కింగ్ ప్రదేశాన్ని ఎమ్మెల్యే సింహాద్రి శనివారం ప్రారంభించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు, చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ క్యాష్ కౌంటర్‌ను ప్రారంభించారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు (బుల్లి), ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. తొలుత స్వామివారిని ఎమ్మెల్యే సింహాద్రి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కలంకారీ కళ అపురూపం



పెడన: హస్తకళల్లో కలంకారీ కళ అపురూపమైందని, దీనికి అతి పురాతనమైన కళగా గుర్తింపు ఉందని విజయవాడ జేడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థినులు అన్నారు. పెడన పట్టణంలోని కలంకారీ పరిశ్రమలను, దుకాణాలను శనివారం వారు పరిశీలించారు. కలంకారీ వస్త్రాల తయారీ, వాటిపై ముద్రణ తదితర వాటిని చూసి వివరాలు తెలుసుకుని నమోదు చేసుకున్నారు. కలంకారీ పరిశ్రమలో వినియోగించే ఏజో ఫ్రీ రంగులను తెలుసుకున్నారు. స్థానిక లక్ష్మీ కలంకారీ ప్రింటింగ్ యూనిట్‌లోను, దుకాణంలోను వస్త్రాల ముద్రణ, మార్కెటింగ్, ప్రభుత్వ సహకారం, ఎగుమతులు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఫ్యాకల్టీలు రమాదేవి, జాహ్నవి, వందన తదితరులు పాల్గొన్నారు.

ఐదోసారి అంబేడ్కర్ దీక్ష



వక్కలగడ్డ(చల్లపల్లి): ప్రముఖ అంబేడ్కరిస్ట్, విశ్రాంత ఈఓపీఆర్డీ దాసి సీతారామరాజు ఐదోసారి అంబేడ్కర్ దీక్ష చేపట్టారు. శనివారం తన స్వగృహంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బుద్ధ వందనం సమర్పించి 14 రోజుల దీక్ష స్వీకరించారు. ఆయనతో పాటు ఇద్దరు కుమారులు జితేంద్ర రాజ్, రాజ్ కిరణ్ కూడా దీక్ష స్వీకరించారు. ఈ దీక్ష ద్వారా 14 రోజుల పాటు అంబేడ్కర్ ఆశయాలు, విధానాలపై ప్రచారం చేస్తానని సీతారామరాజు తెలిపారు. కార్యక్రమంలో ఏబీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్, రాష్ట్ర సచివాలయ న్యాయ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ వెలగపల్లి వెంకటేశ్వరరావు, ఏపీ భవన్ విశ్రాంత అధికారి కంచర్ల జయరాజు, ప్రముఖులు పాల్గొన్నారు.

మోహనరావు మృతికి సంతాపం



కోడూరు: ఉల్లిపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, వైఎస్సార్ సీపీ నేత పోలాబత్తిన మోహనరావు (65) శనివారం మృతిచెందారు. మోహనరావు మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన చేశారు. పదవీ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి గ్రామంలో ముఖ్యనేతగా ఎదిగారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ అభివృద్ధికి కృషి చేశారు. మోహనరావు మృతికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు పరిశె మాధవరావు, కటకం కుటుంబరావు, రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, వివిధ పార్టీల నాయకులు మోహనరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఉపాధికి ఊతం

- పెరగనున్న ఉపాధి కూలీ
- పెడన నియోజకవర్గంలో 3,892 పనుల గుర్తింపు
- 32 వేల మంది కూలీలకు 9.82 లక్షల పని దినాలు
- రూ.27.49 కోట్లు చెల్లించాలని అంచనా



పెడన మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పెడన: ఉపాధి కూలీ గతంలో కంటే పెంపుదల, ఉన్న ఊళ్లోనే పనులు లభిస్తుండటంతో గ్రామస్తులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఉపాధి పనుల్లో వేగం పెరిగింది. పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వేతనం కల్పించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించిన పనులను గుర్తించి అంచనాలు రూపొందించి నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. పెడన నియోజకవర్గంలో సుమారు 3,892 పనులను గుర్తించారు. 32 వేల మంది కూలీలకు 9.82 లక్షల పని దినాలు కల్పిస్తారు. దీనికి రూ.27.49 కోట్లు అవసరమని మండల స్థాయి ఉపాధి హామీ ఏపీఓలు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ఈ నివేదికలను గత ఏడాదితో పోల్చితే ఒక్కో మండలంలో సుమారు 150 నుంచి 250 వరకు అదనంగా పనులను గుర్తించారు. వీటిల్లో ఎక్కువ పంట కాలువలు, పంట బోదెలు పూడికలు తీయడం, తాగునీరు, ఊర చెరువుల పూడికలు తీయడంతో పాటు నీటి కుంటలు తవ్వించడం వంటి పనులు ఉన్నాయి. ఈ ఏడాది కూడా అధికంగా ఈ పనులను గుర్తించి ఉపాధి కూలీలతో చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

రూ.272లకు పెరగనున్న ఉపాధి కూలీ

ప్రస్తుతం రోజుకు ఉపాధి కూలీ రూ.257 ఇస్తున్నారు. ఇదే పనికి కూలీ ధర రూ.15 పెంచుతున్నామని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ మేరకు త్వరలో జీఓ కూడా రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. రోజుకు ఉపాధి కూలీ రూ.257ల నుంచి రూ.272లు కానున్నది.

జాబ్ కార్డు ఉంటే పనులు..

2023–24 ఏడాదికి సంబంధించి పెడన మండలంలో 8,200 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. వీరికి ఉపాధి కల్పించేందుకు 1,108 పనులను గుర్తించారు. 2,42,300 పని దినాలకు రూ.6,22,71,100 అంచనా విలువ కట్టారు. ఈ మేరకు నివేదికలు పంపించారు. అలాగే గూడూరు మండలంలో 8 వేల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. 1,500 పనులను గుర్తించారు. 3.50 లక్షల పని దినాలకు రూ.9.77 కోట్లు అంచనా విలువ కట్టారు. కృత్తివెన్ను మండలంలో 9 వేల జాబ్ కార్డులున్నాయి. వీరికి 433 పనులు గుర్తించగా 1.30 లక్షల పని దినాలకు రూ.3.5 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు. బంటుమిల్లి మండలంలో 6,800 మంది జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు 850 పనులు గుర్తించారు. 2.60 లక్షల పని దినాలకు రూ.8 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు.

గతం కంటే అధికంగా పనుల గుర్తింపు



గత ఏడాది కంటే ఈ ఏడాది సుమారు 200లకు పైగా పనులను అధికంగా గుర్తించాం. ఉపాధి కూలీలు కూడా పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల కేంద్రం ఉపాధి కూలీ రూ.15 పెంచుతున్నట్లు ప్రకటించింది. అయితే దీనికి సంబంధించి ఎటువంటి జీఓ ఇంకా మాకు అందలేదు. వేసవిలో పనుల సమయంలో జాగ్రత్తలను తీసుకుని కూలీల ద్వారా పనులు చేయించేలా చర్యలు చేపట్టాం.

– టి. ముత్యాలు, ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్, పెడన

రైతులకు న్యాయం చేస్తాం

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని



కోనేరుసెంటర్: నాలుగు దశాబ్దాలుగా భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేస్తామని బందరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బందరు మండలం కరగ్రహారం, రుద్రవరం, గుండుపాలెం గ్రామాల్లో శనివారం ఆయన అధికారులతో కలిసి గ్రామసభలు నిర్వహించారు. పేర్ని నాని మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాలుగా ఒకే భూమిలో పంటలు పండించుకుంటున్న రైతులకు న్యాయం జరిగేలా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులందరికీ పూర్తి హక్కు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జేసీ అపరాజితసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రుద్రవరం, గుండుపాలెం గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయా గ్రామాల ప్రజలు పేర్ని దృష్టికి పలు సమస్యలను తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, బందరు ఆర్డీఓ ఐ కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న వెంటే జనం

- మంత్రి జోగి రమేష్
- అక్కచెల్లెమ్మలకు ఆసరా చెక్కుల పంపిణీ



కృత్తివెన్నులో వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: పేదల సంక్షేమమే లక్ష్యంగా..వారి ఆర్థికాభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్నను ఎదుర్కొనేందుకు ఎందరో కుయుక్తులు పన్నుతూ మూకుమ్మడిగా కలిసి రావాలని చూస్తున్నారని, అయినా ప్రజలు మాత్రం జగనన్న వెంటే ఉన్నారని చెప్పారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం కృత్తివెన్ను శివాలయం సమీపంలో నిర్వహించారు. లబ్ధిదారులకు చెక్కులను అందజేసి మంత్రి జోగి రమేష్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పేరుతో గ్రామాల్లో వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. మీకోసం ఇంత చేస్తున్న జగనన్నను మీరంతా మరోసారి ఆశీర్వదించాలని మహిళలను కోరారు. తొలుత ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేసి చీర, సారెను బహూకరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, వెలుగు ఏసీ కనకారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాగౌరి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆదరించండి



సమావేశంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మీ కుటుంబాలను ఆదుకునేందుకు ఏ ప్రభుత్వం కృషి చేసిందో ప్రతి మహిళా బేరీజు వేసుకుని రానున్న రోజుల్లో మనస్సాక్షితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నగరంలోని 12 డివిజన్లకు చెందిన మహిళలకు రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నాలుగు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో 623 సంఘాలకు సంబంధించిన 5,684 మంది డ్వాక్రా మహిళలకు రూ. 7.01 కోట్లు విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. పేదలకు అండగా నిలుస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్న పాలనను, గత టీడీపీ పాలనను బేరీజు వేసుకుని మంచి చేస్తున్నట్లు భావిస్తేనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని కోరారు. ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు.

ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అండ

- షాదీఖానా అభివృద్ధికి ఎంపీ నిధులు రూ.16 లక్షలు
- మంజూరు పత్రం అందజేసిన మంత్రి జోగి రమేష్



నిధుల మంజూరు పత్రాన్ని కమిటీ వారికి అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: ముస్లిం మైనార్టీలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని షాదీఖానా అభివృద్ధికి రూ.16 లక్షలు ఎంపీ నిధులు మంజూరు పత్రాన్ని షాదీఖానా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రిజర్వేషన్ కల్పించి అక్కున చేర్చుకుని వారికి ఉజ్వల భవిష్యత్‌కు మార్గాలను వేసింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన తరువాత అండగా నిలిచింది, నిలుస్తోంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. ముస్లిం మైనార్టీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగానే చూశారని విమర్శించారు. చంద్రబాబు మంత్రి వర్గంలోను, ఎమ్మెల్సీ స్థానాలకు ముస్లింలకు అవకాశం ఇవ్వలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు క్యాబినేట్‌లో డెప్యూటీ సీఎం హోదా కల్పించారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ పదవులను ఇచ్చి మైనార్టీలకు అండగా నిలిచారని వివరించారు. గతంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వచ్చిన సమయంలో షాదీఖానా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారని, ఇచ్చిన మాట ప్రకారం రూ.16 లక్షలు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, గరికిపాటి శివ, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీమ్, సభ్యులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బంటుమిల్లి: మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. బంటుమిల్లి గ్రామంలో 3 కేంద్రాలు, అర్తమూరు, పెదతుమ్మిడి, చోరంపూడి గ్రామాల్లో ఒక్కొక్క పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 720 మంది, ప్రైవేటు విద్యార్థులు 82 మంది పరీక్షలకు హాజరవుతారని వివరించారు.

- గూడూరు: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి గూడూరు మండలంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎంఈఓ సీహెచ్ సత్య సాయిబాబు తెలిపారు. మండలంలో మొత్తం 382 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానుండగా మల్లవోలు జెడ్పీ హైస్కూలు నుంచి అత్యధికంగా 145 మంది, ముక్కొల్లు నుంచి అత్యల్పంగా ఏడుగురు పరీక్షలు రాస్తారని చెప్పారు. గూడూరు హైస్కూలు నుంచి 71 మంది, కప్పలదొడ్డి నుంచి 68, రాయవరం నుంచి 45, కంకటావ నుంచి 37, తరకటూరు నుంచి 35 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరికోసం గూడూరు, మల్లవోలు, కంకటావ జెడ్పీ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దార్ బి.వి జయప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

చిరుధాన్యాలపై అవగాహన



పోషణ్ పక్వాడా సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

బంటుమిల్లి: గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు చిరుధాన్యాల వినియోగం, పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా లీడర్లు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ ఉమారాణి అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ సముద్రవేణి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, వైఎస్సార్ కిట్లు, బాలామృతంను అందరు వినియోగించే విధంగా గ్రామాల్లో గ్రామ సమైఖ్య సంఘ సభ్యులు, వైద్య సిబ్బంది సాయంతో మహిళలకు వివరించాలని సూచించారు. ఎంపీపీ వి. చిన బాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, పీహెచ్‌సీ వైద్యులు పవన్‌కుమార్, ఏపీఎం డి. శ్రీను, ఏసీడీపీఓ సుధారాణి, పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

- బంటుమిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం ఆరోగ్య ప్రదాయినిలా పనిచేస్తోందని సర్పంచ్ తాతా మహాలక్ష్మీ అన్నారు. నాగేశ్వరరావుపేట పంచాయతీ పరిధిలోని నాగేశ్వరరావుపేట, జానకీరామపురం, లక్ష్మీ నారాయణపురం, గార్లగుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులతో సచివాలయంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో 30 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఆలయ ఈఓ పి. సీతారామయ్య పర్యవేక్షించారు.



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని భూ పరివార సమేత వేంకటేశ్వర స్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్ పర్యవేక్షించారు. రెండో రోజైన ఆదివారం స్వామివారి నగరోత్సవం హనుమంత వాహనంపై జరుగుతుంది.

కోడి పందేల శిబిరంపై దాడి

ఐదుగురి అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లంపల్లిలో కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లిలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసి ఒక కోడి పుంజు, రూ.2,200 నగదుని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా కోడిపందేలు, జూదం ఆడినా, నిర్వహించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నేడు మల్లవోలులో ఆసరా చెక్కు పంపిణీ

గూడూరు: వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు ఆదివారం మల్లవోలులో నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రవికుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మల్లవోలు జెడ్పీ హైస్కూల్ ఆటస్థలంలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మల్లవోలు క్లస్టర్ పరిధిలోని మల్లవోలు, రామన్నపేట, పోలవరం, ఐదుగుళ్లపల్లి గ్రామాల డ్వాక్రా అక్కచెల్లెమ్మలు తరలిరావాలని ఆయన కోరారు.

కరగ్రహారంలో ఆర్‌బీకే ప్రారంభం



కోనేరుసెంటర్: కరగ్రహారం గ్రామంలో సుమారు రూ. 29 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం బందరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి ప్రారంభించారు. పేర్ని నాని మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్నిరకాల సేవలను చేరువ చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే అనేక రకాల సేవలను రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, శొంఠి ఫరీద్, వాలిశెట్టి రవిశంకర్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: ప్రజారోగ్య వేదిక–జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు శనివారం తెలిపారు. జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రంలో నిర్వాహకులు శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతంతో బాధపడుతున్న రోగులు వారి ఆరోగ్య రిపోర్టులతో శిబిరానికి హాజరుకావాలని చెప్పారు. జూన్ 4వ తేదీ కూడా ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ, ప్రముఖ వైద్యులు కుప్పా రామశాస్త్రి, పి. సురేష్‌చంద్రరెడ్డి, బీఆర్‌కే ప్రసాద్, టి. పద్మావతి, రావి శ్రీనివాసరావు, ఆర్. శంకరానంద్ పాల్గొని రోగులకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను రూ. 200 లకే ఇస్తామని చెప్పారు. సమావేశంలో నాగయ్య, నారాయణ, మాదాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

మోపిదేవి: స్థానిక గొడపాలెం రామాలయం వద్ద శ్రీ రామ నవమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత స్వామివారికి పూజలు చేశారు. స్థానికులతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య



కోడూరు: కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం సాంకేతిక సమస్య తలెత్తింది. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనుల నిమిత్తం ఉదయం 8 గంటలకు విద్యుత్ అధికారులు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. 11 గంటల సమయంలో సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ పరికరం భారీ శబ్దంతో పేలిపోయింది. ఆ సమయంలో మంటలు వ్యాపించాయి. సిబ్బంది హుటాహుటిన సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ప్రారంభించారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మళ్లీ ట్రాన్స్‌మీటర్ వద్ద మరో పరికరం పేలి, భారీ శబ్దం వచ్చింది. దీంతో సాంకేతిక సిబ్బంది వచ్చి సాయంత్రం వరకు పనులు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఏఈ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.